## క్లుప్తంగా

### ఘనంగా కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీ లక్ష్మీగణపతి శివ మార్కండేయ దేవాలయంలో బుధవారం లలిత సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు చేశారు. అనంతరం వారాహి అమ్మవారికి ప్రత్యేక హోవన కార్యక్రమం, నిత్యాభిషేక కార్యక్రమం నిర్వహించారు.

### విద్యార్థులకు ప్రోత్సాహకం

మంచిర్యాలటౌన్: పదో తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు మంచిర్యాల పట్టణంలోని సంజీవని ఆసుపత్రి, స్కాన్ సెంటర్‌లో ముత్తినేని లక్ష్మయ్య విద్యా ప్రోత్సాహకం కార్యక్రమాన్ని సంజీవని ఆసుపత్రి అధినేత ముత్తినేని అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి యాదయ్య హాజరయ్యారు. ఒకరికి రూ.15వేలు, ఐదుగురు విద్యార్థులకు రూ.5వేల చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ ముత్తినేని రాజయ్య, సెక్టోరియల్ ఆఫీసర్ చౌదరి, టీపీఏ జిల్లా అధ్యక్షులు పోకల వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులు కావలెను

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో పాఠాలు బోధించడానికి అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవింద్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను అడహక్ బేసిస్ పద్ధతిలో పదో తరగతి ఇంగ్లీష్ మీడియం నందు సోషల్ బయోసైన్స్ బోధించుటకు అర్హులైన వారి నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సోషల్ టీచర్‌కు బీఏ, బీఈడీ సోషల్ మెథడాలజీ కలిగి ఉండాలని, సైన్స్ టీచర్ బీఎస్సీ, బీజెడ్సీ, బీఈడీ బయోసైన్స్ మెథడాలజీ కలిగి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు సింగరేణి పాఠశాల 94419 94947కు సంప్రదించాల్సిందిగా సూచించారు. జులై 7లోగా దరఖాస్తులు స్వీకరించబడతాయని తెలిపారు.

### నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్'

నెన్నెల: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు నెన్నెల ఎస్సై శ్యాంపటేల్ అన్నారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు బుధవారం నెన్నెల మండల కేంద్రంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చాలా మంది యువకులు ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్నారని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కృష్ణ, అనంత్, సత్యం, ప్రజలు పాల్గొన్నారు.

### విద్యార్థినికి సన్మానం

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్న మేడి శ్రీలత అనే విద్యార్థిని 32(టి) బెటాలియన్ స్థాయిలో ఉత్తమ ఎన్‌సీసీ కేడెట్‌గా ఎంపికై ప్రశంసాపత్రంతో పాటు నగదు పారితోషికం అందుకుంది. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చక్రపాణి ఆమెను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ తిరుపతి, అధ్యాపకులు గులాం రసూల్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

### 'అన్ని రంగాల్లో శ్రీరాంపూర్ ముందంజ'



శ్రీరాంపూర్: అన్ని రంగాల్లో శ్రీరాంపూర్ ఏరియా ముందుంటుందని కంపెనీ డైరెక్టర్ (ఫైనాన్స్, పర్సనల్) బలరాం తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో బుధవారం ఆయన పర్యటించారు. నూతనంగా నిర్మించిన పర్సనల్ డిపార్టుమెంట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను దిగ్విజయం చేసిన జీఎం సంజీవరెడ్డికి ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్మిక సంఘాల నాయకులు పిక్నిక్ స్పాట్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. బదిలీ వర్కర్లకు యాక్టింగ్ ప్రమోషన్లు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందించారు. అండర్ గ్రౌండ్‌లో మెడికల్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ సూపర్‌వైజర్లకు సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వాలని మైనింగ్ స్టాఫ్ ప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు. సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో శాశ్వత ప్రాతిపదికన గ్రంథాలయం ఏర్పాటు చేయాలని పలువురు నిరుద్యోగ యువకులు వినతిపత్రం ఇచ్చారు.

## చినుకుపడితే చిత్తడే..



మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రయాణ ప్రాంగణం ఏ మాత్రం చినుకులు పడినా చిత్తడిగా మారుతుంది. అసలే ఇరుకుగా ఉన్న ప్రయాణ ప్రాంగణం ముఖద్వారం ఓ వైపు ద్విచక్రవాహనాలు.. ఇంకోవైపు నిలిచిన నీరుతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనధికారికంగా నిలుపుతున్న వాహనాలు అక్కడ పెట్టకుండా చూడటంతో పాటు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రమాదకరంగా సెప్టిక్ ట్యాంకులు



దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సెప్టిక్ ట్యాంకులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఒక ట్యాంకుకు పైకప్పు పగిలిపోవడంతో, దానిపై ఒక రేకును సగం వరకు కప్పి ఉంచారు. ఆసుపత్రి ఎదుట ఒక ట్యాంకు పై కప్పు బిల్ల పగిలిపోవడంతో అది అలాగే ఉంచారు. ఆసుపత్రికి వచ్చే వారు ఆవరణలో అటు, ఇటూ తిరిగే సమయంలో ఏ మాత్రం ఆదమరిచినా అందులో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న సెప్టిక్ ట్యాంకులకు పైకప్పులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – దండేపల్లి



## నాసిరకం ఇసుకతో నిర్మాణాలు



దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'మనఊరు–మనబడి' పథకంలో భాగంగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణం పనుల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నిర్మాణం పనులను గుత్తేదారు ఇష్టారాజ్యంగా చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణం పనుల్లో గోదావరి ఇసుకకు బదులు, స్థానికంగా లభించే వాగు ఇసుకను వినియోగిస్తున్నాడు. ఇసుకలో మట్టి కలిసి ఉంటడంతో పగుళ్లు తేలే ప్రమాదం ఉంది. ఇటీవల పనులను ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేశం పరిశీలించి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో మండిపడ్డారు. ఈ విషయమై ఐటీడీఏ ఏఈఈ రాజేశ్వర్‌ను సంప్రదించగా, నాసిరకం ఇసుక వినియోగిస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. దానిని వాడొద్దని గుత్తేదారుకు చెప్పినట్లు పేర్కొన్నారు.

## గేటు మూశారు.. పరిశుభ్రత మరిచారు



మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని టూటౌన్‌కు వెళ్లేందుకు హమాలివాడ వద్ద ఉన్న రైల్వే గేటును గతేడాది రైల్వే అధికారులు మూసేశారు. పక్కనే రైల్వే అండర్‌బ్రిడ్జిని నిర్మించడం వల్ల, రాకపోకలను అండర్‌బ్రిడ్జి నుంచి సాగిస్తుండగా, గేటును మూసేయడంతో ప్రజలు, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అయితే గేటుకు ఇరువైపులా మురికి నీరు రోడ్డుపైన నిలిచి, రోజుల తరబడి కావడంతో నాచుగా మారుతోంది. వర్షాకాలం కావడం, నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉండడంతో, స్థానికంగా నివాసం ఉండే ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. గేటు మూసేస్తే, మున్సిపల్ అధికారులు మురికి నీరు నిల్వకుండా కనీస జాగ్రత్తలను తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రోడ్డు తవ్వారు.. పనులు వదిలేశారు



దండేపల్లి మండల కేంద్రం నుంచి నర్సాపూర్ వెళ్లే రోడ్డు మరమ్మతులకు ఇటీవల నిధులు మంజూరయ్యాయి. దీంతో నిర్మాణం పనులు చేపట్టేందుకు, నెల రోజుల క్రితం రోడ్డుపైగల పాత బీటీని తవ్వి పక్కకు పోశారు. దీంతో మళ్లీ పనులు ప్రారంభించకపోవడంతో రోడ్డంతా రాళ్లు తేలి ఉండటంతో, రోడ్డుపై ప్రయాణం, నరకప్రాయాన్ని తలపిస్తోంది. ఈ విషయమై పీఆర్‌ఏఈఈ తివారిని సంప్రదించగా ప్రస్తుతం మెటల్ వేసి రోలింగ్ చేసి, వర్షాకాలం తర్వాత బీటీ వేస్తామని చెప్పారు. – దండేపల్లి

## భవనం ఉరుస్తోంది..!



కాసిపేట తెలంగాణ మోడల్ స్కూల్ భవనాన్ని కాంట్రాక్టర్ పూర్తిగా అప్పగించక ముందే వరండాలో జాయింట్‌ల వద్ద ఉరుస్తోంది. మరిన్ని గదుల నిర్మాణానికి బిల్లులు సరిపోకపోవడంతో నిర్మించకుండానే వదిలేశారు. గతేడాది చివరలో విద్యాశాఖమంత్రి ఆ భవనాన్ని ప్రారంభించగా, క్వాలిటీ అధికారుల బృందం పరిశీలించి నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని పనులు తొలగించి మళ్లీ చేయాలని ఆదేశించారు. ఆ కాంట్రాక్టర్ పనులు పదిరోజుల్లో పూర్తిచేస్తానని చెప్పినా, నేటికీ పనులు చేపట్టకుండా అలాగే వదిలేశారు. – కాసిపేట

## వంటషెడ్డు నిరుపయోగం



భీమారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో రెండేళ్ల క్రితం లక్షలు వెచ్చించి నిర్మించిన వంటషెడ్డు నిరుపయోగంగా ఉంది. మధ్యాహ్న భోజనం వండడానికి వంటషెడ్డు నిర్మించినా తలుపులు బిగించక పోవడంతో ఇప్పటివరకు ప్రారంభించనట్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని ఆరుబయటే వండుతున్నట్లు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు. – భీమారం

## విద్యార్థులతో 'విద్యుత్' పనులు



భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులు విద్యుత్ పనులు చేయడం చర్చనీయాంశంగా మారింది. పాఠశాలలో బుధవారం చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులతో చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ ప్రధానోపాధ్యాయుడు సంజీవ్ విద్యుత్ పనులు చేయించడం తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గొడుగు పట్టుకొని విద్యార్థులు పనులు చేయడం చర్చనీయాంశంగా మారింది. విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని విస్మరించి ఇలా పాఠశాలలో పనులు చేయించడం సరికాదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అసలే వర్షాకాలం కావడం విద్యుత్ ప్రమాదాలు సైతం పొంచి ఉండటం విద్యార్థులకు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.


# బోధకాలు నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రీజనల్ కో ఆర్డినేటర్ శిరీష

దండేపల్లి/జన్నారం: బోధకాలు నిర్మూలనపై దండేపల్లి, జన్నారం మండల పరిషత్ కార్యాలయాల్లో అయా పరిధిలోని ఏఎన్ఎంలు, ఎం.ఎల్.ఎచ్.పీలు, ఆశ కార్యకర్తలకు బుధవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బోధకాలు నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలని, ప్రపంచ ఆరోగ్య సంస్థల ప్రతినిధుల బృందం, రీజినల్ కో ఆర్డినేటర్లు రాజేందర్‌కుమార్ సింగ్, శిరీషపటేల్, కేంద్ర ఆరోగ్యశాఖ ప్రతినిధి డాక్టర్ కమలాకర్ సూచించారు. ఆగస్టు 10న ప్రారంభమయ్యే మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇందుకోసం ప్రణాళికను సిద్ధం చేసుకొని, మొదటి మూడు రోజులు బూత్‌లలో, పది రోజులు మూడు రకాల మాత్రలను మింగించాలన్నారు. వయస్సును బట్టి డీఈసీ, ఎత్తును బట్టి ఐవర్ మెక్టిన్, మాత్రలు మింగించాలన్నారు. కార్యక్రమాల్లో జిల్లా ప్రోగ్రాం అధికారి అనిత, హెల్త్ ఎడ్యూకేటర్ అల్లాడి శ్రీధర్, జన్నారం వైద్యాధికారి ఉమాశ్రీ, సీహెచ్‌వోలు రమేశ్, శ్రీనివాస్, హెల్త్ ఎడ్యూకేటర్ నాందేవ్, సబ్ యూనిట్ ఆఫీస్ సూపర్వేజర్లు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# 'బీసీబంధు' అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు బీసీబంధు పథకం అమలు చేయాలని బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీసీలు ఆత్మగౌరవంతో జీవించాలంటే బీసీబంధు పథకాన్ని అమలు చేసి ఆదుకోవాలన్నారు. బీసీలలో 125కులాలకు చెందిన వారు అత్యంత వెనుకబడిన స్థితిలో ఉన్నారని, సంచార జాతులకు చెందిన వారు అత్యంత దయనీయస్థితిలో బతుకుతున్నారన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా కో కన్వీనర్ లక్ష్మణ్, నాయకులు వెంకటయ్య, రవి, ఎల్లన్న, కుమార్, చంద్రమౌళి, రాములు, భిక్షపతి, రామస్వామి, భాస్కరాచారి, సత్యనారాయణ, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



బాధ్యతలు అప్పగిస్తున్న లయన్స్‌క్లబ్ గవర్నర్

దండేపల్లి: లయన్స్‌క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని లయన్స్ క్లబ్ పీఎంజీఎఫ్ గవర్నర్ చిదుర సురేష్ అన్నారు. మండల లయన్స్ క్లబ్ సమావేశాన్ని మేదరిపేటలో బుధవారం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాదంశెట్టి మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా కుంచె కిషన్, కోశాధికారిగా పాత శ్రీనివాస్ తో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

**కుట్టు మిషిన్ కేంద్రం ప్రారంభం**

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం బైపాస్ రోడ్డులోని ఎస్‌వీ కాంప్లెక్స్‌లో ఉచిత కుట్టు మిషిన్ శిక్షణ కేంద్రాన్ని లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జీ ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ లయన్ రిక్కాల నారాయణ రెడ్డి ప్రారంభించారు. మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా పేపర్ బ్యాగ్స్, క్లాత్ బ్యాగ్స్ కుట్టించి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేయించి, కుటుంబ పోషణకు కొంత డబ్బులు అందించాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్ లయన్ డా.చంద్రమోహన్ గౌడ్ ఉదారి, జోన్ చైర్‌పర్సన్ లయన్ భాస్కర్, జిల్లా చైర్‌పర్సన్ లయన్ మహేందర్ రెడ్డి, కో ఆర్డినేటర్ లయన్ అన్నపూర్ణ, మహిళలు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**డీఈవోకు వినతి**

మంచిర్యాలఅర్బన్: అనుమతిలేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేవారు.

**దరఖాస్తుల ఆహ్వానం**

లక్సెట్టిపేట: స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు కు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సి పాల్ జై కిషన్‌ఓజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన వారు ఇంటిగ్రేటెడ్ డిగ్రీతో పాటు బీఈడీ 4సంవత్సరాల కోర్సుకు జులై 19తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

**కొండయ్యకు సన్మానం**

మందమర్రిరూరల్: ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్న జీఎం(పీపీ) కొండయ్యను ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో గల కాన్ఫరెన్స్ హాల్లో ఏరియా జీఎం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా సేఫ్టీ జీఎం కేహెచ్ఎన్ గుప్తా, ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, కేకే–ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, సీనియర్ పీవో మైత్రేయబంధు తదితరులు ఉన్నారు.

**టీడీపీ నాయకుల నిరసన**

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. బురదమయమైన ఆర్‌కేపీ–క్యాతనపల్లి ప్రధాన రోడ్డుపై మొక్కలు నాటి నిరసన తెలిపారు.

**'నకిలీ విత్తనాలు వాడొద్దు'**

భీమిని: నకిలీ విత్తనాలు వాడి రైతులు మోసపోవద్దని ఎస్సై నరేష్ అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రైతులతో మాట్లాడుతూ నిషేధిత గ్లైసిల్ విత్తనాలు వాడొద్దన్నారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

**కొనసాగుతున్న కాంగ్రెస్ పాదయాత్ర**

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల, తుర్కపల్లి, కమ్మరిపల్లి గ్రామాల్లో బుధవారం చెన్నూర్ నియోజకవర్గ పీసీసీ సభ్యుడు నూకల రమేష్ ఆధ్వర్యంలో గడపగడపకూ కాంగ్రెస్ పాదయాత్ర కార్యక్రమం కొనసాగింది.

**'నీటి కష్టాలు ఎమ్మెల్యే దృష్టికి'**

మంచిర్యాలఅర్బన్: స్థానిక హమాలీవాడ సినిమా వాడ ప్రైమరీ స్కూల్లో బోర్ ఎండిపోయి నీటికి ఇబ్బంది పడుతున్నట్లు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ రాజయ్యకు విన్నవించారు. ప్రత్యామ్నాయంగా పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరారు.

# 'కల్యాణలక్ష్మి పథకం దేశానికి ఆదర్శం'



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి పథకం దేశానికి ఆదర్శమని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో బుధవారం 78మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను, 51మందికి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు పల్లపు తిరుపతి, పట్టణ కౌన్సిలర్లు మెరుగు మహేశ్వరి, సుదమల్ల హరికృష్ణ, మోతె సుజాత, తెరాస నాయకులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

మున్సిపాలిటీలోని 6వ వార్డులో రూ.91లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. 19వ వార్డులో రూ.25లక్షల నిధులతో పనులను ప్రారంభించారు.

నస్పూర్: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని 1, 2, 5, 10, 14, 18, 22వార్డుల్లో రూ.కోటి 66లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల ఏర్పాటుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వరద సమస్యకు పరిష్కారం ఏది?

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



ప్రచారంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: వరద ప్రభావిత ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వం, ఎమ్మెల్యే దివాకర్‌రావు విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన పట్టణంలోని 21వ వార్డు, ఎల్ఐసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, కిషోర్, శ్రీదేవి, మల్లేష్, మల్లికార్జున్, లక్ష్మణ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలి**

మంచిర్యాలటౌన్: బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేసి, రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఉమ్మడి జిల్లాలోని 100మంది కార్యకర్తలు ఢిల్లీకి వెళ్తుండగా, వారికి పుష్పగుచ్చం అందించి వీడ్కోలు పలికారు.

**'బీఆర్ఎస్‌కు రోజులు దగ్గర పడ్డయ్'**

బెల్లంపల్లి: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్ విమర్శించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 9వార్డు బుచ్చయ్యపల్లి గ్రామంలో బుధవారం గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, నాయకులు రాజలింగు, రాజనర్సు, ఎరుకల శ్రీనివాస్, ఆకుల శంకర్, యుగంధర్, లక్ష్మణ్, రాములు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్య పరిష్కరించాలని వినతి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా నుంచి బైపాస్‌కు వెళ్లే దారి సమస్యను పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌ను కలిసి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఆ మార్గంలో ఆసుపత్రులు ఉండడంతో వైద్యం కోసం ప్రజలు వస్తుంటారని, మార్గం ఇరుకుగా, గుంతల మయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కుంచాల శంకరయ్య, బియ్యాల రాజేశం, గాజుల రవికుమార్, దేవి పోచన్న, యాదగిరి పాల్గొన్నారు.

## శిథిలమైన గోదావరి రోడ్డు



చెన్నూర్: పట్టణంలోని గోదావరి నదికి వెళ్లే రోడ్డు శిథిలావస్థకు చేరింది. సింగరేణి సంస్థకు చెన్నూర్ గోదావరి నది నుంచి రోజుకు వందలాది లారీల ఇసుకను తరలిస్తుండడంతో రోడ్డు గుంతలుగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గురువారం తొలి ఏకాదశి పర్వదినం కావడంతో భక్తులు గోదావరి నదికి పుణ్యస్నానాల కోసం అధికంగా తరలివచ్చే అవకాశం ఉండడంతో భక్తులకు తిప్పలు తప్పవని పలువురు చర్చించుకుంటున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

